క్లుప్తంగా

నేడు సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కింపు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు హుండీలు తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. హుండీల ఆదాయం లెక్కింపులో దేవస్థానం సిబ్బంది అందరూ విధిగాహాజరు కావాలని ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. చివరిగా జూలై 29వ తేదీన సత్యదేవుని హుండీ కానుకలు లెక్కించారు. 33 రోజుల తరువాత సోమవారం మళ్లీ లెక్కించనున్నారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.1.40 కోట్లకు పైగా వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఘనంగా విశ్వహిందూ పరిషత్ 60 వసంతాల వేడుక



విశ్వహిందూ పరిషత్ అరవై వసంతాల వేడుకల్లో మాట్లాడుతున్న సత్యనారాయణ

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో విశ్వహిందూ పరిషత్ 60 వసంతాల వేడుకను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రచారకులు చిక్కాల సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గండేపల్లి మండలాధ్యక్షులు మావిరెడ్డి వీరభద్రరావు, కార్యదర్శి పిరాట్ల చిరంజీవి, సహాయ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యమే మోదీ సంకల్పం



ప్రత్తిపాడులో బీజేపీ సభ్యత్వ నమోదు కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు రూరల్: వికసిత్ భారత్ లక్ష్యమే ప్రధాని నరేంద్రమోదీ సంకల్పమని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. ప్రత్తిపాడులో ఆదివారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవి సత్తిరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదును సోమవారం నుంచి అక్టోబర్ 15 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండిన యువత, అన్ని వర్గాల ప్రజలతో బీజేపీ సభ్యత్వ నమోదు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ ఏలేశ్వరం పట్టణ అధ్యక్షుడు రెడ్డి లోవరాజు, ప్రత్తిపాడు మండల ప్రధాన కార్యదర్శి మదినే బాబ్జీ, డాక్టర్ బేతా ఈశ్వరరావు, సీంద్రిపు భద్రం, గొల్ల కుమారి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



బూట్‌క్యాంప్‌లో పాల్గొన్న ఆదిత్య సిబ్బంది, విద్యార్థులు

గండేపల్లి: ఇంజినీరింగ్ విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆదిత్య యూనివర్సిటీ ఉపకులపతి ఎంబీ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో హైదరాబాద్‌కు చెందిన ఆర్టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మెగా బూట్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉజ్వల భవిష్యత్‌ను ఇచ్చే శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవడంలో చైతన్యవంతులు కావాలన్నారు. పాఠ్యాంశాలు, శిక్షణలో నేర్చుకున్న అంశాలు ఉన్నత ఉద్యోగాల సాధనకు ఉపయోగపడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

'కోట' నృత్య కళాకారిణికి మెడల్

సామర్లకోట: కూచిపూడి నృత్య కళాకారిణి కోడూరి సత్య చరిష్య వరల్డ్ రికార్డు హోల్డర్ మెడల్ సాధించింది. ఇంటర్నేషనల్ కర్ణాటక్ మ్యూజీషియన్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారణాశిలో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో సామర్లకోటకు చెందిన కోడూరి సత్య చరిష్య పాల్గొంది. రావణాకృత శివతాండవం ప్రదర్శించి మెడల్ సాధించినట్టు ఆమె తల్లిదండ్రులు రాణి, శివప్రసాద్ ఆదివారం రాత్రి ఇక్కడ తెలిపారు. నృత్య కళాకారిణి సత్య చరిష్యను ఎమ్మెల్యే రాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అభినందించారు.

అన్నదాతకు వాయుగండం

- మూడు రోజులుగా ఎరతెరిపి లేకుండా వర్షాలు
- వందలాది ఎకరాల్లో నీటమునిగిన వరి చేలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- అల్లకల్లోలంగా మారిన సముద్రం



కొమ్మనాపల్లిలో నీటిమునిగిన వరిపొలాలను చూపిస్తున్న రైతు



ఏవీనగరంలో మునిగిన వరిపొలాలు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రైతుల పాలిట శాపంగా పరిణమించింది. అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని వరిపొలాలు నీట మునిగాయి. నియోజకవర్గంలో వందలాది ఎకరాల్లో పంట నీట మునగడంతో పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

16 వేల ఎకరాల్లో వరి సాగు

మండలంలోని పంపా, పీబీసీ ఆయకట్టు ప్రాంతాల్లో దాదాపుగా 16 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు జరుగుతోంది. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లోనూ వరినాట్లు పూర్తయ్యాయి. మెట్ట ప్రాంతాలైన ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం, బెండపూడి తదితర ప్రాంతాల్లో స్వల్ప విస్తీర్ణంలో వరినాట్లు వేస్తున్నారు. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షాలకు మండలంలోని కొమ్మనాపల్లిలో దాదాపుగా 400 ఎకరాలకు పైగా వరిపంట నీట మునిగింది. ఎ.కొత్తపల్లి, కోదాడ, సీతారాంపురం, ఏవీ నగరం, వేమవరం, జి.మునలయ్యపేట తదితర ప్రాంతాల్లోనూ అధిక వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి చేరడంతో వందలాది ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. రోజుల తరబడి వరిపంట నీట మునగడంతో చేను కుళ్లిపోతుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోతున్న నీరు

మండలంలోని పలు గ్రామాల్లో ఆదాయార్జనే ధ్యేయంగా భూస్వాములతో పాటు పెద్ద రైతులు తమ భూములను రొయ్యలు, చేపల చెరువులకు లీజుకుఇచ్చారు. దీంతో అనుమతులతో కొన్ని, అనుమతులు లేకుండా మరికొన్ని వందల ఎకరాల్లో రొయ్యలు, చేపల చెరువులు తవ్వారు. ముఖ్యంగా సీతారాంపురం, కొమ్మనాపల్లి, రావికంపాడు, ఒంటిమామిడి, వేమవరం, జీమునలయ్యపేట, ఏవీ నగరం తదితర ప్రాంతాల్లో అధికంగా రొయ్యలు, చేపల చెరువులు తవ్వారు. ఆయా ప్రాంతాల్లో పంట కాలవలు, వృథా నీరు పోయే డ్రైన్లు ఆక్రమణలకు గురవ్వడంతో వరదల సమయంలో వరదనీరు పోయే మార్గం లేక నిల్వ ఉండిపోవడంతో చెరువుల పరిసర ప్రాంతాల్లో వరిపొలాలన్నీ ముంపు బారిన పడుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీరంతా సముద్రంలోకి పోయేందుకు వీలుగా కాలువలను ఏర్పాటు చేయకుంటే ఏటా ముంపు బారిన పడి పంటలు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. వర్షం కారణంగా మెట్ట గ్రామాల్లోని పత్తి చేలల్లో భారీగా వరద నీరు చేరడంతో పంట దెబ్బ తిందని బాధిత రైతులు వాపోతున్నారు.

ఎగసి పడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటడంతో సముద్రంలో అల్లకల్లోలంగా మారింది. ప్రతికూల వాతావరణంపై మత్స్యశాఖ అప్రమత్తం చేయడంతో మత్స్యకారులు సముద్రంపై వేట మానుకుని తమ బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. దానవాయిపేట, అద్దరిపేట, పెరుమాళ్లపురం, కొత్తపోడిపల్లిపేట ప్రాంతాల్లో సముద్ర అలలు సుమారు రెండు మీటర్ల పైగా ఎగసిపడుతున్నాయి. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో తీరప్రాంతంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు.

శివారు కాలనీలు జలమయం

ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షాలకు మండల వ్యాప్తంగా శివారు కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బెండపూడిలో తారకరామ కాలనీ, ఎ.కొత్తపల్లిలో కొత్త కాలనీ, ఎస్సీకాలనీ, సీతారాంపురం, పెరుమాళ్లపురం, ఆవులమంద, కోదాడ కాలనీ, పి.అగ్రహారం తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇళ్ల నుంచి ప్రజలకు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

మూడెకరాల్లో పంట నీటమునిగింది



కొమ్మనాపల్లిలో నేను మూడెకరాల్లో వరి పంట వేశాను. సుమారు రూ.50 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. వరినాట్లు వేయించి కొద్ది రోజులే అవుతోంది. మొత్తం పంట వరదనీటిలో మునిగిపోయింది. పంట నష్టపోయిన నాలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– సాధనాల వెంకటరమణ, రైతు, కొమ్మనాపల్లి, తొండంగి మండలం

పంట కుళ్లిపోతోంది



నేను ఐదెకరాల్లో వరి సాగు చేశాను. దాదాపుగా రూ.65 వేల పెట్టుబడి పెట్టాను. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీరు మా గ్రామంలో పంటలను ముంచెత్తింది. వరద నీరు కిందకు పోయే మార్గం లేకపోవడంతో పొలాల్లోనే ఉండిపోయింది. రోజుల తరబడి పంట నీటిలో ఉండటంతో వరికంకులు కుళ్లిపోతున్నాయి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– శివకోటి రాజు, రైతు, కొమ్మనాపల్లి, తొండంగి మండలం

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని: స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం అట్టహాసంగా జరిగింది. అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే యనమల దివ్య, సభ్యులుగా తటవర్తి రాజా, డాక్టర్ వాణిజ్య, గంట్ల చిన్నారావు, డాక్టర్ సుబ్బారావు, పూడి కృష్ణవేణి, ఆర్డీఓ సీతారామారావు, కమిషనర్ వెంకటరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

చేయూత వార్షికోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే సత్యప్రభకు ఆహ్వాన పత్రికను అంజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ప్రత్తిపాడు రూరల్: కాకినాడలో ఈ నెల 14న నిర్వహించనున్న చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవానికి హాజరు కావాలని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు ఆ సంస్థ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ప్రత్తిపాడులో స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎం.రవికుమార్, ఏపీ సీఆర్పీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.రాంజీ ప్రసాద్, సంస్థ ప్రతినిధులు బాషా, సీఆర్ఎంటీ బాషా తదితరులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

యాజమాన్య పద్ధతులతో నష్ట నివారణ

- వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు
- సస్య రక్షణపై రైతులకు అవగాహన



తేటగుంటలో కూరగాయల రైతుకు రక్షణ చర్యలు వివరిస్తున్న హెచ్‌ఓ విజయలక్ష్మి

తుని రూరల్: అధిక వర్షాలకు పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ముంపు బారిన పడిన పండ్లతోటలు, కూరగాయాల పంటల్లో నష్ట నివారణకు రైతులు యాజమన్య పద్ధతులు చేపట్టాలని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి సూచించారు. తేటగుంట, రాజులకొత్తూరు, టి.తిమ్మాపురం తదితర గ్రామాల పరిధిలో వరదనీటి ముంపు ప్రాంతాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. మొక్కతోటలైన అరటి, బొప్పాయి, కోకో, కొబ్బరి, ఆయిల్ పామ్, కూరగాయలు, పూల తోటలను పరిశీలించారు. ముంపు నివారణకు నీటి పారుదత కాలువలు ఏర్పాటు చేయాలని సూచించారు.

అరటిలో..

నేల తడి ఆరిన తర్వాత వంద గ్రాముల యూరియా, 80 గ్రాముల పొటాష్, 20 నుంచి 25 రోజుల వ్యవధిలో రెండు, మూడు దఫాలు వేసుకోవాలన్నారు. దుంప కుళ్లిపోకుండా నివారించడానికి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములను లీటరు నీటిలో కలిపి దుంప చుట్టూ తడపాలన్నారు. 75 శాతం గెల తయారీకి వచ్చిన తర్వాత ఆకులు, గెల తడిచే విధంగా లీటరు నీటిలో ఐదు గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్, ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ ఎరువును మూడు రోజుల వ్యవధిలో మూడు సార్లు ఒకదాని తర్వాత మరొకటి పిచికారీ చేయాలని సూచించారు. లేత గెలలపై కార్బండిజం ఒక గ్రాము లీటరు నీటిలో జిగురుగా కలిపి గెలలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు.

బొప్పాయిలో..

ఎక్కువ మొక్కలు పక్వానికి వస్తే వ్యాధులు రాకుండా హెక్సాకొనజోల్ మందును రెండు మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అధిక వర్షాలు వల్ల నేల కోతకు గురై భూసారం తగ్గుతుందని, సిఫార్స్ చేసిన ఎరువులను ఐదు నుంచి పది శాతం అధికంగా వేసుకోవాలన్నారు. సూక్ష్మ పోషకాలైన జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు లేదా బోరాన్ ఒక గ్రాముకు లీటరు నీటితో పాటు పది గ్రాముల యూరియా కలిపి 20 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలని సూచించారు. ఈదురు గాలుల నుంచి కాపాడేందుకు చుట్టూ దరి పంట వేసుకోవాలన్నారు. నేలకొరిగే అవకాశం లేకుండ ఊత కర్రలు ఏర్పాటు చేయాలన్నారు.

కూరగాయల పంటల్లో...

వర్షాలు ఆగిన వెంటనే యూరియా, సూక్ష్మ పోషకాలను పిచికారీ చేసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపు తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేటట్టు చూడాలన్నారు. మొక్కలకు ఊత ఇవ్వడం, పందిళ్లపై తీగజాతి కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తొండంగి: అధిక వర్షాల నుంచి కూరగాయాలు, అరటి ఇతర ఉద్యాన పంటలను రక్షించుకునేందుకు రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని తుని ఉద్యానవనశాఖాధికారి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉద్యాన తోటలను ఆదివారం ఆమె పరిశీలించారు. నీట మునిగిన ఉద్యాన తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆమె వెంట గ్రామ సచివాలయ హార్టీకల్చర్ అసిస్టెంట్ తాతాజీ తదితరుల ఉన్నారు.

పంట రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి



తిరుమాలిలో అరటి తోటలు పరిశీలిస్తున్న మండల ఉద్యాన అధికారి శ్రీవల్లీ

ఏలేశ్వరం: వర్షాల కారణంగా పంటలు నష్టపోకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి ఎ.శ్రీవల్లీ సూచించారు. మండలంలోని తిరుమాలిలో ఆదివారం ఆమె పర్యటించారు. ఉద్యాన పంటలైన అరటి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అరటి తోటల్లో నీరు నిల్వ లేకుండా కాలువలు తీసి బయటకు పంపాలన్నారు. దుంప కుళ్ల తెగులు నివారణకు కాపర్‌ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అంతర సేద్యం చేసే మొక్కకు 100 గ్రాముల యూరియా, 50 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మొక్కకు 2 నుంచి 3 సార్లు 20 నుంచి 25 రోజుల వ్యవధిలో వేయాలన్నారు. పడిపోయిన కూరగాయాల మొక్కలను జాగ్రత్త నిలబెట్టి మొదలులో మట్టి వేయాలన్నారు. ఆకుమచ్చ, కాయకుళ్లు, బూజు తెగుళ్ల అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా లీటర్ నీటిలో 2.5 గ్రాముల సాఫ్ మందును కలిపి రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన గ్రామ సహాయకులు పుష్పాలత రైతులు పాల్గొన్నారు.


వైభవంగా అమ్మవారి బోనాల సంబరం



కొత్తయర్రవరంలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

ఏలేశ్వరం: మండలంలోని కొత్తయర్రవరంలో వేంచేసిన ధనలక్ష్మి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బోనాల సంబరం వైభవంగా జరిగింది. మహిళలు పసుపు చీరలు ధరించి బోనాలతో గ్రామంలోని పలు వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపునకు ఏర్పాట్లు చేశారు. తొలుత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పంపా నుంచి 3 వేల క్యూసెక్కుల విడుదల



పంపా బ్యారేజీ నుంచి విడుదల చేసిన నీరు



పంపా బ్యారేజీని పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

అన్నవరం: గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంపా రిజర్వాయర్‌లోకి భారీగా వదర నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రం పంపా బ్యారేజీ నాలుగో నంబర్ గేటు ఎత్తి సుమారు 3 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. ఈ నీటి వలన పంపా సర్‌ప్లస్ కెనాల్ నుంచి నీరు పొంగి పొర్లుతోంది. నీటి విడుదల పెరిగితే జాతీయ రహదారిపై పంపానీరు ప్రవహించే అవకాశం ఉంది. రిజర్వాయర్ అధికారులు, పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. పంపాకు ఇన్‌ఫ్లో పెరిగితే మిగిలిన గేట్లు కూడా ఎత్తి నీటిని సముద్రంలోకి విడుదల చేసే అవకాశం ఉంది. పంపా బ్యారేజీని ఆదివారం సాయంత్రం పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు సందర్శించారు. పంపా నుంచి సముద్రంలోకి నీటిని విడుదల చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తతంగా ఉండాలని సూచించారు. పంపా రిజర్వాయర్ నీటిమట్టం వంద అడుగుల వద్ద స్థిరంగా ఉంది. పంపాలోకి భారీగా నీరు వస్తున్నప్పటికీ వచ్చిన నీటిని వచ్చినట్టుగా బ్యారేజీ గేట్లు ద్వారా దిగువకు వదిలేస్తున్నారు. పంపా నీటిని సముద్రంలోని విడుదల చేయడంతో కాలువ పక్కనే గల రియల్ ఎస్టేట్ స్థలాలు, పొలాలు నీట మునిగాయి. వాటితో పాటు జాతీయ రహదారి పక్కనే నిర్మించిన సత్యదేవుని నమూనా ఆలయానికి ఇరువైపులా వర్షపు నీరు చేరింది. జాతీయ రహదారి నుంచి ఆలయం వద్దకు వెళ్లడానికి గల మార్గం యథాతథంగా ఉండడంతో భక్తులు స్వామివారి దర్శనం చేసుకునేందుకు ఇబ్బంది కలగలేదు.

ముంపు ప్రాంతాల్లో మెరుగైన సేవలందించాలి

తుని: ముంపు ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే యనమల దివ్య అధికారులను ఆదేశించారు. తాండవ జలాశయం నీటిని ఆదివారం నదికి విడుదల చేసిన నేపథ్యంలో స్థానిక తారక రామనగర్‌లో తాండవ వరదనీటిని ఆమె పరిశీలించారు. నీరు మరింత పెరిగితే కలిగే నష్టాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నది ఉధృతి తగ్గే వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హోరు వాన

- వరుసగా మూడోరోజూ భారీగా వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పంట పొలాలు

ఏలేశ్వరం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ప్రత్తిపాడు, తుని, ఏలేశ్వరం నియోజకవర్గాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం తెలవారుజాము నుంచి ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, రహదారులు నీట మునిగాయి. ఏలేశ్వరం పట్టణంలోని పలు కాలనీలతో పాటు షిర్డీనగర్, ఆర్టీసీ కాలనీల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. వర్షాలతో పాటు సెలవురోజు కావడంతో జనం ఇంటి వద్దనే గడిపారు. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. వాహనాల రాకపోకలు అంతంత మాత్రంగా సాగాయి.

నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు

కిర్లంపూడి: గత మూడు రోజులుగా ఎడతేరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. సింహాద్రిపురం ఎస్సీపేటలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడ్డారు. డ్రైన్లు చెత్త, వ్యర్థాలతో మూసుకుపోవడంతో వరద నీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు.



ధర్మవరం వద్ద పొంగి పొర్లుతున్న సుద్దగెడ్డ వాగు



సింహాద్రిపురంలో నీట మునిగిన ఎస్సీ కాలనీ



తుని వద్ద తాండవ మినీ రిజర్వాయర్ పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పి.అగ్రహారంలో వరి పొలాలను పరిశీలించిన ఆర్డీఓ

తొండంగి: పంపా రిజర్వాయర్‌లో అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో మండలంలోని పి.అగ్రహారంలో వరి పొలాలను పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు ఆదివారం పరిశీలించారు. వరదనీరు త్వరితగతిన కిందికి పోయేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

తుని రూరల్: మండలవ్యాప్తంగా ఆదివారం విస్తారంగా వర్షం కురిసింది. నాలుగు రోజులుగా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, అనకాపల్లి జిల్లా నాతవరం వద్ద తాండవ రిజర్వాయర్ క్రస్ట్ గేట్ల నుంచి విడుదల చేస్తున్న అదనపు జలాలతో తాండవ నదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తుని పట్టణానికి ఎగువన, దిగువన ఉన్న రెండు మినీ రిజర్వాయర్ల ఎడమ, కుడి కాలువలు ద్వారా పంట పొలాలకు నీరు విడుదల చేస్తున్నప్పటికీ వరదనీరు కట్టడాల పైనుంచి ప్రవహిస్తూ పెంటకోట వద్ద సముద్రంలో కలుస్తోంది. మరో పక్క పంపా రిజర్వాయర్ నుంచి అదనపు జలాలు విడుదలవుతుండడంతో తుని మండలం గవరపేట, టి.తిమ్మాపురం గ్రామాలకు చెందిన పంట భూములు నీటి మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పుష్కర కాలువ నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తుండడంతో తుని మండలం గవరపేట, టి.వెంకటాపురం, టి.తిమ్మాపురం, హెచ్.కొత్తూరు, హంసవరం, ఎన్.చామవరం, వల్లూరు, ఎ.అగ్రహారం తదితర గ్రామాల పరిధిలో సాగునీటి చెరువులు వరదనీటితో నిండికుండల్లా తొణికిసలాడుతున్నాయి. హంసవరంలో 167 ఎకరాల భూగర్భం కలిగిన కేఎంఆర్ ట్యాంకు (చెరువు) కళింగల్ పైనుంచి వరదనీరు ప్రవహిస్తోంది. రైతులు, గ్రామీణులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు సూచించారు. ఇప్పటివరకూ ఎటువంటి నష్టం వాటిల్లలేదదని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

పొంగి పొర్లుతున్న వాగులు

ప్రత్తిపాడు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండల వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకూ తుంపర్లు, చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు సుబ్బారెడ్డి సాగర్, కట్టుచింతల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువ, సుద్దగెడ్డ, ఎర్ర కాలువ, పంట కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. పుష్కర కాలువల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. పంట ముంపునకు గురికాకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.